

రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, లంకల దీపక్‌రెడ్డి తదితరులు

రక్తదానానికి యువత ముందుకు రావాలి: బీజేపీ

బర్కత్‌పుర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. రక్తం కొరత వల్ల ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయని, ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రక్తదానం మహాప్రాణదానమన్నారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు వంద మంది యువత రక్తదానం చేయగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ వారు రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శృతి, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, సి.కృష్ణగౌడ్, ఏడెల్లి అజయ్‌కుమార్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, వనం రమేష్, ఓబీసీ మోర్చా నగర ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, యశ్వంత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న టీడీపీ జాతీయ ప్రచారకార్యదర్శి దశరథ్, నాయకులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : టీడీపీ

నల్లకుంట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వందల ఎకరాలలో పేద రైతులు వర్షాలతో చేతికి వచ్చిన పంట వరి, పత్తి, పసుపు, గోధుమ, సజ్జలు, మొక్క జొన్న తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జిల్లాల వారిగా నష్టపోయిన రైతులను గుర్తించి సహాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్, నాయకులు భానుప్రకాష్, ఎస్.కృష్ణ, చారి తదితరులు పాల్గొన్నారు.



రవాణా రంగ కార్మికులతో నిరసనలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ నేతలు

రవాణా రంగ కార్మికుల హామీలను అమలు చేయాలి

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్

బర్కత్‌పుర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి పిలుపుమేరకు ప్రైవేట్, ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నారాయణగూడ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘాల నాయకులు కందుల ఉపేందర్, ఎస్.దయానంద్, అంబదాసు, నాగరాజు, నాగమల్లయ్య, జానయ్య, కనకయ్య పాల్గొన్నారు.

'హిందూ ధర్మ పరిరక్షణ కోసం యువత పనిచేయాలి'

ముషీరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ కోసం యువత అంకిత భావంతో పనిచేయాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రవినూతల శశిధర్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని భోలక్‌పూర్ హౌస్ వద్ద హిందూ వాహిని భోలక్‌పూర్ శాఖ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా శశిధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశం కోసం, ధర్మం కోసం హిందూవులంతా సంఘటితం కావాలన్నారు. సమావేశంలో హిందూ వాహిని ప్రధానకార్యదర్శి బబ్లూ విశ్వేశ్వర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు అయిల భాస్కర్, నాయకులు కేఎం.శంకర్, ఆర్.విశ్వం, మురళి, సూర్య పాల్గొన్నారు.

'జైస్వాల్‌గార్డెన్' అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

గోల్నాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌లోని జైస్వాల్‌గార్డెన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మాధు సత్యంగౌడ్, ప్రధానకార్యదర్శిగా ఎన్.స్వామిగౌడ్, చైర్మన్‌గా హెచ్‌బీ.వల్లభ్, ఉపాధ్యక్షుడిగా పి.కృష్ణ, కోశాధికారిగా రాములుయాదవ్, ముఖ్యసలహాదారులుగా బి.వినోద్‌కుమార్, ఎ.లక్ష్మీపతి, కేశవరావు, కె.సత్యనారాయణ, జాయింట్‌సెక్రటరీగా ఎ.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.ప్రవీణ్‌కుమార్, సభ్యులుగా కె.శ్రీనివాస్‌గౌడ్, వీవీ.రాంచందర్‌రావు, డి.చెన్నయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మైసమ్మ దేవాలయ కమిటీ నూతన కార్యవర్గం

గోల్నాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జైస్వాల్‌గార్డెన్ కాలనీ లోని మైసమ్మ దేవాలయం కమిటీ నూతన అధ్యక్షుడిగా చెరుకు యాదవరెడ్డి, ప్రధానకార్యదర్శిగా సీహెచ్.ఇంద్రసేన్ యాదవ్, చైర్మన్‌గా ఎన్.రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కె.దిలీప్‌గౌడ్, కోశాధికారిగా పంజాల వెంకటేష్‌గౌడ్, ముఖ్య సలహాదారులుగా జి.ప్రసన్నాంజనేయులు, జిసురేందర్, ఎ.రామాగౌడ్, బి.మధుసూదన్‌చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.శ్రీహరిచారి, సభ్యులుగా పి.రామస్వామి, కె.ఈశ్వరయ్య, కె.అశోక్‌కుమార్, టి.కృష్ణవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

బర్కత్‌పుర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఫలక్‌నుమా - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల నడుమ 25 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని యువకుడు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడి శరీరంపై ఎరుపు రంగు ఫుల్ షర్ట్, నలుగురంగు ప్యాంట్ ఉన్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



పద్మశాలీ కాలనీ సంజీవ హనుమాన్ దేవాలయంలో కలశాలకు పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బింగి నవీన్, తదితరులు

ముషీరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌లోని సంజీవ హనుమాన్ దేవాలయంలో వేంకటేశ్వరస్వామి 2వ వార్షిక మహోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి సంప్రదాయ పద్ధతిలో పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... హనుమాన్ దేవాలయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు, ఉగాది పురస్కారాలు, శ్రీరామనవమి వేడుకలు ప్రతి యేటా వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ఆలయ కమిటీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీతామార్కండేయ, పుండరీకం, కోశాధికారి గడ్డం నవీన్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.వెంకటేష్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, ఆర్.ఆంజనేయులు, వినోద్ కుమార్, ఎన్ కృష్ణమూర్తి, కృష్ణ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో ప్రజల్లో ఐక్యత

ముషీరాబాద్ : పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తున్నాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం గుల్షాన్ నగర్‌లోని అంజుమన్ హాల్‌లో స్థానికులు అబ్దుల్ సమద్ షఫీఉద్దీన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ సీఐ రాంబాబు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, పార్టీ సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు షరీఫ్, చాంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మసూద్, ఎస్సైలు లక్ష్మీపతి, రాజేష్, డీఎస్పై చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, రోడ్లు, వీధిదీపాల సమస్యలు పరిష్కరిస్తా

రాంనగర్: రాంనగర్ డివిజన్‌లోని రిసాలకుర్షిద్‌జాయి బస్తీలో తాగునీరు, రోడ్లు, వీధి దీపాల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఎమ్మెల్యే గోపాల్ తెలిపారు. సోమవారం గోల్కొండ చౌరస్తా నుంచి రిసాలకుర్షిద్‌జాయి మసీదు వరకు దెబ్బతిన్న రోడ్డు, శ్మశాన వాటికలో స్ట్రీట్‌లైట్, రిసాలబస్తీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని జలమండలి డీజీఎం మోహన్‌రావు, మేనేజర్ శివకుమార్, జీహెచ్ఎంసీ డీఈ గీత, ఏఈ మురళికి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హుస్సేన్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్‌ముదిరాజ్, ప్రధానకార్యదర్శి దామోదర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, మురళి, శేఖర్, ప్రవీణ్, గోరఖ్‌నాథ్ బస్తీవాసులు పాల్గొన్నారు.

భోజనం కార్మికులకు రూ.10వేలు వేతనం చెల్లించాలి

● పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి ● యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ



ఇందిరాపార్కువద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ప్రధానకార్యదర్శి ఎస్వీరమ తదితరులు

కవాడిగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వారికి రూ.10వేల కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు వై.స్వప్న, ప్రధానకార్యదర్శి ఎస్వీ రమ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇందిరాపార్కువద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వారు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఆరుగ్యారంటీలు ఇచ్చి అందులో గృహజ్యోతి పథకానికి ఎక్కడా సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. మహిళల అకౌంట్లలో రూ.2500 వేస్తామని చెప్పి మోసం చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు, 3 నెలల వేతన బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. వంటకు అవసరమైన గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ఉచితంగా సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ కోడిగుడ్ల బిల్లులు, వేతనాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్ హాజరై మద్దతు ప్రకటించారు. యూనియన్ నాయకులు పద్మ, సుల్తాన్, మాయ, కృష్ణమాచారి. చిన్నన్న, సామంచి లక్ష్మి, ఉన్నికృష్ణ తదితరులతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



డాక్టర్ మహేందర్‌కుమార్‌రెడ్డికి వైద్యసేవారత్న జాతీయ పురస్కారం అందజేస్తున్న జస్టిస్ చంద్రయ్య, తదితరులు

పురస్కార గ్రహీతలకు మరిన్ని బాధ్యతలు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలు అందుకున్న వారికి మరిన్ని బాధ్యతలు పెరుగుతాయని జస్టిస్ చంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సర్వజన సుఖినోభవంతు సంస్థ 8వ వార్షికోత్సవం, ఉగాది పండగ సందర్భంగా ఉగాది జాతీయ పురస్కారాల ప్రదానం జరిగింది. సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జస్టిస్ చంద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులను ప్రదానంచేసి మాట్లాడారు. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన లయన్స్ ఇంటర్నేషనల్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి.మహేందర్‌కుమార్‌రెడ్డికి వైద్యసేవారత్న జాతీయ పురస్కారం ఇవ్వడం అభినందనీయమన్నారు. పేద ప్రజలకు వైద్యసేవలు అందించడంలో మహేందర్ కుమార్‌రెడ్డి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. మహేందర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో తాను అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండడికృష్ణారెడ్డి, కూచిపూడి నటి భారతి, లయన్ నయనాదేవి, ఉమాశంకర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పండుగల సెలవులు ఇవ్వాలి : సీఐటీయూ

గోల్నాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ముఖ్యమైన పండుగలకు సెలవులు ఇవ్వాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు జి.రాములు, సహాయ కార్యదర్శి సి.మల్లేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్‌ను కార్యాలయంలో జి.రాములు, సి.మల్లేష్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు అంజయ్యతో కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో 18,600 మంది కార్మికులు పనిచేస్తున్నారని, అందులో ఎక్కువ శాతం మంది మహిళా కార్మికులు ఉన్నారని, బోనాలు, దసరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, రంజాన్, క్రిస్మస్ పండుగలకు వీరికి సెలువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండుగల సందర్భంగా ఒక్కపూట 10గంటలకు అటెండెన్స్ తీసుకుని సెలవు ఇవ్వాలని అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్‌ను కోరామన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

బర్కత్‌పుర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకుంది. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పుర రాఘవేంద్రస్వామి దేవాలయం సమీపంలో నాగమణి(45) కుమారునితో కలిసి నివాసం ఉంటుంది. గొడవల వల్ల ఆమె భర్తకు దూరంగా ఉంటోంది. అనారోగ్య సమస్యలతో నాగమణి ఇబ్బందులు పడుతోంది. సోమవారం సాయంత్రం బయటి నుంచి వచ్చిన కుమారుడు తలుపు తెరిచి చూడగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మధ్య భారతంలో యుద్ధం వెంటనే ఆపాలి

●కేంద్ర ప్రభుత్వం, సీపీఐ మావోయిస్టు పార్టీ శాంతి చర్చలు జరపాలి ● పీస్ డైలాగ్ కమిటీ సదస్సులో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, కేంద్ర ప్రభుత్వం, సీపీఐ మావోయిస్టు పార్టీ బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలని పలువురు వక్తలు కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీస్ డైలాగ్ కమిటీ (శాంతి చర్చల కమిటీ) ఆధ్వర్యంలో మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ గోపాల్, ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వరరావు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కందిమల్ల ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతి, చెరుకు సుధాకర్, న్యాయవాది వెంకన్న, ప్రొఫెసర్ జయకుమార్, జర్నలిస్ట్ దుర్గాప్రసాద్, జంపన్న, రాములు హాజరై మాట్లాడారు. దండకారణ్యంలోని ఆదివాసీ ప్రజలపై మావోయిస్టు పార్టీపై కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న కగార్ అనే అంతిమ యుద్ధం ద్వారా మానవ హననం, రక్తపాతం కొనసాగుతుందన్నారు. డ్రోన్‌లతో జంబింగ్ చేస్తూ ఎన్‌కౌంటర్ల పేరుతో జరిగిన మారణహోమంలో వందలాది మంది చనిపోతున్నారని పేర్కొన్నారు. ఈ కాల్పులు ప్రజాస్వామికవాదులు, లౌకికవాదులను, బుద్ధిజీవులను, సామాన్యప్రజలను కలవరపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలని వారు కోరారు.

ఆపరేషన్ కాగర్‌ను నిలిపివేయాలి: సీపీఐ (ఎంఎల్)

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కాగర్‌ను వెంటనే నిలిపివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆదివాసులకు కల్పించిన హక్కులకు పాలకులు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. షెడ్యూల్ 5, 6 లో వారికి రక్షణ కల్పించాలని ఉన్నప్పటికీ పాలకులు వారి హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కేంద్రం ఆదేశాలతోనే ఈ ఆగడాలు జరుగుతున్నాయని ఆదివాసుల హక్కుల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జేవీ.చలపతిరావు, వి.సంధ్య, గోవర్ధన్, ఎం.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలోని కోదండరామచంద్ర స్వామివారి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. ఈనెల 30 నుంచి వచ్చేనెల 7వ తేదీవరకు శ్రీకోదండరామచంద్రస్వామి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని వారు తెలిపారు. వచ్చేనెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు కోదండ రామచంద్రస్వామి, సీతామహాసాధ్వి కల్యాణమహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరుగుతుందని 7న పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

'మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి'

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని రాష్ట్ర మహిళాకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఆమె చిక్కడపల్లిలో మాట్లాడారు. ఈ సందర్భంగా పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ మాట్లాడుతూ తక్షణమే మహిళలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలనలో మహిళలపై కొనసాతున్న అణచివేతను ఆపాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణమే అన్ని రంగాల్లో అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు 33శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు.

'ముషీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరేయాలి'

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ పిలుపునిచ్చారు. భరత్‌గౌడ్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ ఇంటర్నెట్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ దోనేటి సత్యం తదితరులు సోమవారం భరత్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వి.రాజశేఖర్, రవీందర్ గౌడ్, లక్ష్మీనారాయణ, మారుతి, కార్తీక్, ఉల్లాస్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ ప్రజలకు న్యాయ సహాయం: ఎఫ్ఎస్‌జే

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు న్యాయ సహాయం అందించేందుకు, సామాజిక ఉద్యమాలకు సిద్ధమవుతున్నామని హైకోర్టు న్యాయవాది, ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు నర్రిస్వామి తెలిపారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని ఫోరం కార్యాలయంలో ఆయన సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పలు కంపెనీలు వదులుతున్న రసాయనాల కాలుష్యం పెరిగిపోయి చౌటుప్పల్ చుట్టుపక్కల ప్రాంతాలప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక చైతన్యవేదిక నాయకులు శ్రీరామ్, నక్కరాజు, చంద్రశేఖర్, కృష్ణయ్య, పరమేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రైటింగ్ స్కిల్ ఫర్ ప్రొఫెషనల్ గ్రోత్‌పై సదస్సు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్‌లో గల స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం అధ్యక్షుడు డాక్టర్ బి.కుమారస్వామి అధ్యక్షతన రైటింగ్ స్కిల్ ఫర్ ప్రొఫెషనల్ గ్రోత్ అంశంపై నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు మాట్లాడుతూ వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం అనేది విద్యార్థికి చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకట ఈశ్వర్, డాక్టర్ లావణ్య, అధ్యాపకులు డాక్టర్ ముక్తావాణి, రాజశేఖర్, యాదగిరి, నీరజ, ఇర్ఫానబేగం తదితరులు పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి వ్యక్తి మృతి

అఫ్జల్‌గంజ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ కాంప్లెక్స్‌లో దొంగతనానికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు భవనం పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆబిడ్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులో అర్ధరాత్రి సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మూసి ఉన్న గదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అలికిడి రావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ వారు పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారు భయంతో వేరే భవనంపైకి దూకేందుకు ప్రయత్నించగా ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. అతడి తలకు, ముఖానికి, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు బేగంబజార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొదట సోషల్ మీడియాలో హత్యగా ప్రచారం కావడంతో ఆబిడ్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, బేగంబజార్ సీఐ విజయ్‌కుమార్, క్లూస్ టీమ్‌లు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

● రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని డీడీ కాలనీ వద్ద రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ మనీష, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, గోవింద్ అర్జున్‌లు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి